## కాంగ్రెసోళ్లకే సమాచారమిచ్చారని నిరసన



రైతు వేదిక వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఖానాపూర్ రూరల్, జూన్ 16: సత్తనపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు రావాలని స్థానిక ఏఈవో ప్రకటన చేశారు. ఈ మేరకు సోమవారం బీఆర్ఎస్ నాయకులు సత్తనపల్లి రైతువేదిక వద్ద నిరసన తెలిపారు. ఇక్కడ సోమార్ పేట్ మాజీ సర్పంచ్ గోపాల్, నాయకులు శనిగారపు ప్రవీణ్, అల్లి మల్లేశ్, రాజుల్లయ్య, రాజ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

## కార్యవర్గం ఎన్నిక

నిర్మల్ అర్బన్, జూన్ 16: నిర్మల్‌లోని శ్రీనగర్‌కాలనీ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మూడారపు పరమేశ్వర్, అధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నాలం మదనమోహన్, కోశాధికారిగా పద్మాల గణేశ్, ఉపాధ్యక్షులుగా భూమేశ్, సాయన్న, సహాయ కార్యదర్శులుగా మధుసూదన్, రాజేశ్, విశిష్ట సలహాదారులుగా గంగాప్రసాద్, నర్సింహులు, పూసాల పోశెట్టి, అనుమల భాస్కర్, రమేశ్, ప్రవీణ్, మహేశ్ ఉన్నారు.

## అక్రమ నిర్మాణాలు తొలగించండి

కుభీర్, జూన్ 16: నిర్మల్ జిల్లా కుభీర్‌లోని ప్రభుత్వ దవాఖానను అనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన షెడ్లను తొలగించాలని సోమవారం తహసీల్దార్ శివరాజ్‌కు గ్రామస్తులు, శ్రీ విఠలేశ్వర ఆలయ కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఇక్కడ ఆలయ కమిటీ అధ్యక్షుడు పెంటాజీ, గ్రామస్తులు ఉన్నారు.

## ఆర్థిక సాయం

భైంసా, జూన్ 16: నిర్మల్ జిల్లా భైంసా మండలం అంతర్ని గ్రామంలో శిథిలావస్థకు చేరిన భవనం కూలి విద్యార్థికి గాయాలయ్యాయి. సోమవారం తానూర్ మండల జౌల(కే) మాజీ సర్పంచ్ చక్రధర్ బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. ఇక్కడ ఉత్తం బాలేరావు, గంగాధర్, కొత్తూరు శంకర్, సాయినాథ్ ఉన్నారు.

## బెల్గాంతండాలోకి ఎలుగుబంటి

కుభీర్, జూన్16: బెల్గాంతండా–1లో సోమవారం ఎలుగుబంటి రావడంతో గిరిజనులు భయభ్రాంతులకు గురయ్యారు. చుట్టూ అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న తండాలోని పల్లె ప్రకృతి వనంలోకి ఎలుగుబంటి రావడంతో గ్రామస్తులు కేకలు వేశారు. దీంతో ఎలుగుబంటి అటవీ ప్రాంతానికి పరుగులు తీసింది. అటవీ ప్రాంతం చుట్టూ ఫెన్సింగ్ వేసి, గ్రామంలోకి అడవి జంతువులు రాకుండా చూడాలని ఫారెస్ట్ అధికారులను గిరిజనులు కోరుతున్నారు.

## భక్తులకు ఇబ్బందులు రానివ్వొద్దు

బాసర, జూన్ 16: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే పవార్ రామారావుపాటిల్ పేర్కొన్నారు. గోదావరిలో ఆదివారం ఐదుగురు పడి మృత్యువాత పడడంతో, సోమవారం ఆయన నది వద్ద ఘాట్‌ను పరిశీలించారు. ఆలయ అధికారులకు వివరాలు అడిగి, వారికి పలు సూచనలు చేశారు. ఘాట్ల వద్ద ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, పకడ్బందీగా భద్రత చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట అధికారులు, నాయకులు ఉన్నారు.

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 16: రాంపూర్ గ్రామానికి చెందిన మత్స్యకారులు తమపై గొడ్డళ్లతో దాడి చేశారని, బాధ్యులపై చర్యలు తీసుకుని, తాము గోదావరి నదిలో చేపలు పట్టుకునేందుఉ అనుమతివ్వాలని దస్తూరాబాద్ మండల మత్స్య పారిశ్రామిక సంఘం సభ్యులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. తాము గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో చేపలు పట్టుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని, 1974లో సంఘం ఏర్పాటు చేసుకుని మత్స్యశాఖ నుంచి లైసెన్సులు పొందినట్లు తెలిపారు. తర్వాత కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కలెక్టర్ స్పందించి, ఎస్పీతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలుపడంతో వారు ఆందోళన విరమించారు.

## కవితలకు ఆహ్వానం

భైంసా, జూన్ 16: ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతిని (ఈ నెల 21) పురస్కరించుకొని కవితలను ఆహ్వానిస్తున్నట్లు శ్రీ హంస వాహిని సాహిత్య కళాపీఠం అధ్యక్షుడు, కోశాధికారి జాదవ్ పుండలిక్‌రావు పాటిల్, బసవరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు వచన కవిత 16లైన్లను మించకుండా ఈ నెల 19లోగా జయశంకర్ సార్ జీవిత చరిత్ర ఆధారంగా కవితలను నంబర్‌కు (9908376796) పంపాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదంపై మాజీ మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం

ఎదులాపురం, జూన్ 16 : ఉట్నూర్ మండలంలోని బీర్సాయి పేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై మాజీ మంత్రి జోగు రామన్న తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భాగ్యనగర్‌కు చెందిన గంట విజయతో పాటు మనుమడు ఈర్ల సహర్ష ఘటన స్థలంలోనే మృతి చెందడం బాధాకరమని తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## 'ఆర్టీసీ'ని సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్ టౌన్, జూన్ 16: ఆర్టీసీ బస్సు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెట్‌పల్లి డిపో మేనేజర్ దేవరాజు పేర్కొన్నారు. సోమవారం ఆయన నిర్మల్ జిల్లా ఖానాపూర్ బస్టాండ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కొందరు పట్టణవాసులు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. హైదరాబాద్‌కు యథావిధిగా బస్సు సర్వీసును కొనసాగించాలని, తిరుగుపయనంలో వయా నిర్మల్ మీదుగా ఖనాపూర్ వరకు బస్సు సర్వీస్‌ను నడపాలని కోరారు. ఖానాపూర్ నుంచి హైదరాబాద్‌కు ఉదయం నడుపుతున్న సూపర్ లగ్జరీ బస్సు రద్దు అయిందని అబద్ధపు ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. బస్టాండ్‌లోకి ప్రైవేట్ వాహనాలను రాకుండా అడ్డుకోవాలని పోలీస్‌శాఖకు సూచించారు. ఇక్కడ కంట్రోలర్ రాజశేఖర్, సిరిపురం సాయికృష్ణ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

**PUBLIC NOTICE**

All the general public here by informed that **Sri. Chinnam Ganesh S/o Chinnaiah, Occ: Agriculture, R/o H.no.4-97/1, Rajura village - Khanapur, Dist. Nirmal** intended to deposit his title deeds of the over the property of the The open plot no. 1 in Block AV in Sy.no. 165, total admeasuring 36x50=1800 Sq. feet = 200 Sq. yards = 167.22 Sq. meters situated at Thimmapur village, under the limits of municipality Khanapur, Mandal: Khanapur, Dist. Nirmal which is bounded by **East** :20 feet wide road, **West:** Plot No.02, **North :** Plot No.03 ,**South :** 20 feet wide road. At present **Sri. Chinnam Ganesh S/o Chinnaiah** is intended to create **EQUITABLE MORTGAGE** in favour of M/s. Shriram Finance Ltd., Branch: Khanapur for the purpose of Small & Medium Enterprises loan.

As such if any person or persons have any interest or any other right or title over the said property can furnish their objections if any, for the said creation of mortgage, and if they have any claims with regard to title and have any documents related to the said property also can file and furnish the same at my office within a **week days time** from the publication of this notice. If any objections **pertains** to the said property raised after the said stipulated time, shall not be entertained and considered.

Hence this notice.

**Sd/- J.KRISHNA MOHAN RAO** ,M.A. LLB., ADVOCATE,SHRIYAM 'SAI' H.No, 1-3-458 Road No 2, Shastrinagar ,South Nirmal Dist, Nirmal, Pin: 504106, Cell: No 9959298938

# ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలి

● ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం, జూన్ 16: బాధితుల సమస్యలపై బాధ్యతాయుతంగా వ్యవహరించి, తమ పరిధిలోని ప్రతి ఫిర్యాదును పరిష్కరించేందుకు పోలీసు సిబ్బంది నిరంతరం కృషి చేయాలని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ స్పష్టం చేశారు. సోమవారం ఆదిలాబాద్‌లోని పోలీసు ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 54 ప్రజా ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే ఫోన్ ద్వారా సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తమ వద్దకు వచ్చిన ఫిర్యాదులలో ఎక్కువగా భూ సమస్యలకే సంబంధించినవి ఉన్నాయని తెలిపారు. నకిలీ రిజిస్ట్రేషన్లు, డబుల్ రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రజలను మోసం చేస్తున్న ఘటనలపై దర్యాప్తు జరిపి, అవసరమైన ఆధారాలతో కేసులు నమోదు చేయాలని సూచించారు. ప్రతి సోమవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. ప్రజలు తమ సమస్యలను సంబంధిత పోలీస్ స్టేషన్లలో లేదా నేరుగా జిల్లా ఎస్పీకి ఫిర్యాదులు సమర్పించవచ్చని తెలిపారు.



ఎస్పీని సన్మానిస్తున్న బాధితులు

సదూర ప్రాంతాలకు చెందిన బాధితులు తమ సమస్యలను వాట్సాప్ ద్వారా పంపాలనుకుంటే 8712659973 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీసీ కొండ రాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారి జైస్వాల్ కవిత, సిబ్బంది వామన్ పాల్గొన్నారు.

### 10 కేసులలో బాధితులకు తిరిగి డబ్బులు అందజేత

ఎదులాపురం, జూన్ 16: ఆదిలాబాద్ జిల్లాలో ఇటీవల నమోదైన 10 సైబర్ నేర కేసులలో బాధితులు నష్టపోయిన మొత్తం మొత్తంలో కీలకమైన భాగాన్ని తిరిగి అందజేయడంలో జిల్లా పోలీసు శాఖ కీలకపాత్ర పోషించింది. సోమవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో జిల్లాలో సైబర్ నేరాల ద్వారా మోసపోయి పోలీసుల సహాయంతో బాధితులకు ఎస్పీ అఖిల్ మహాజన్ డబ్బులు అందజేశారు. బాధితులు ఎస్పీ అఖిల్ మహాజన్‌ను శాలువాతో సన్మానించి మిఠాయి తినిపించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ మోసాలకు గురైన వెంటనే వారు వెంటనే 1930 నంబర్‌ను సంప్రదించడం వల్ల మోసపోయిన డబ్బు తిరిగి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. గత నెల రోజుల కాలంలో జిల్లా పోలీస్ యంత్రాంగం పది కేసుల్లో కోర్టు ద్వారా బాధితుల మొత్తం రూ.లక్ష వరకు తిరిగి అందజేసామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావ్, సైబర్ క్రైమ్ ఇన్‌చార్జి ఓ.ఎస్.సుదర్, సిబ్బంది కె.సాయి శివ, అబ్దుల్ అహాద్, వై.సంతోష్ పాల్గొన్నారు.

## తహసీల్దార్ దురుసు ప్రవర్తనతో బేజారు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రైతులు

సోన్, జూన్ 16: తహసీల్దార్ దురుసు ప్రవర్తనతో విసిగివేసారిన కడ్తాల్ గ్రామ రైతులు కలెక్టర్‌కు రాతపూర్వక ఫిర్యాదు అందించారు. వివరాల్లోకి వెళ్తే.. మండలానికి చెందిన రైతులు రెవెన్యూ పనుల నిమిత్తం కార్యాలయానికి వెళ్లినప్పుడు తహసీల్దార్ మల్లేశ్ మలకకగా మాట్లాడుతూ, పరుష పదజాలం వినియోగిస్తూ దుర్భాషలాడుతూ అవమానంగా భావించిన కడ్తాల్ గ్రామానికి చెందిన రైతులు ఆగ్రహం చారు. అన్నదాతలు తమ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం సంప్రదిస్తే వివిధ రకాల కొర్రీలు పెడుతూ కార్యాలయం చుట్టూ రోజుల తరబడి తిప్పించుకుంటున్నారని వాపోయారు. సమస్యల పరిష్కారానికి వెళ్తే ఆగ్రహంతో తిడుతూ అవమానకర రీతిలో మాట్లాడుతున్నారని ఆందోళన చెందారు. గ్రామానికి చెందిన వ్యవసాయదారులంతా కలిసి రాతపూర్వకంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇక్కడ రైతులు రాంరెడ్డి, గంగాధర్, రాకేశ్, రాజేశ్వర్, లక్ష్మారెడ్డి, తదితరులు ఉన్నారు.

## గోదావరి నది ఘాట్లను పరిశీలించిన ఎస్పీ

బాసర, జూన్ 16: బాసర గోదావరి నది ఘాట్లను సోమవారం నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఘాట్ల వద్ద ప్రమాద ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్‌తో చర్చించి పుష్కరస్నానాల వద్ద భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. పుష్కర ఘాట్ వద్ద ప్రత్యేక హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, సీఐ, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు

ఎదులాపురం, జూన్ 16 : ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని ఎంఈవో సోమయ్య హెచ్చరించారు. సోమవారం మావలలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నారని ఏబీవీపీ నాయకులు సమాచారం అందించారు. ఆయన పాఠశాలను పరిశీలించి పాఠ్యపుస్తకాల గదిని సీజ్ చేశారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్, నిఖిల్ ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

ఎదులాపురం, జూన్ 16: ఆదిలాబాద్ రిమ్స్‌లో పని చేస్తున్న మహిళా కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి నళిని రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆదిలాబాద్ రిమ్స్‌లో పని చేస్తున్న మహిళా కార్మికులు ఎన్ఎఫ్ఐడబ్ల్యూ సభ్యత్వం తీసుకున్నారు. రిమ్స్ విభాగం అధ్యక్షురాలిగా అనసూయను ఎన్నుకున్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, పింఛన్, కాంట్రాక్ట్ ప్రకారం పూర్తిస్థాయిలో వేతనం అందజేయాలన్నారు.

## రిమ్స్ డైరెక్టర్‌కు స్వల్ప అస్వస్థత

ఎదులాపురం, జూన్ 16 : ఆదిలాబాద్ రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ మూడు రోజులుగా స్వల్ప జ్వరంతో ఇబ్బంది పడుతున్నాడు. సోమవారం ఉదయం నుంచి డయేరియా లక్షణాలు ప్రదర్శించడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌లో చేరారు. దవాఖానలో చేరిన అనంతరం వైద్య బృందం ఆయనకు దినమంతా పర్యవేక్షణలో వైద్యం అందించారు. ప్రస్తుతానికి ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

## వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇంద్రవెల్లి, జూన్16: వానకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామాల్లో పని చేస్తున్న వైద్య సిబ్బంది ప్రజల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి రాథోడ్ నరేందర్ అన్నారు. సోమవారం మండలంలోని పిట్టబొంగురం పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించిన పీఎం జన్ మన్ కార్యక్రమంలో భాగంగా సంచార వైద్య వాహనం ఐఈసీ వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట వైద్య సిబ్బంది ఉన్నారు.





తాంసి : మొక్క నాటుతున్న బీఆర్ఎస్ నాయ కులు, మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాశ్ఇచ్చోడ: కేక్ కోస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఇచ్చోడ: సిరికొండలో..

# మొక్కలు నాటి.. పూజలు చేసి

● బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ జన్మదిన వేడుకలు

తాంసి, జూన్ 16 : తాంసిలోని రామలింగేశ్వర ఆలయంలో బీఆర్ఎస్ నాయకులు పూజలు చేసి బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాశ్ (కృష్ణ) నాయకులతో కలిసి పూల మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఇచ్చోడ, జూన్ 16 : జన హృదయనేత, బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఇచ్చోడలో బీఆర్ఎస్ నాయకులు కేక్ కోసి సంబురాలు నిర్వహించారు. ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ ప్రీతమ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు గాడ్గే సుభాష్, శివకుమార్, వెంకటేశ్, ఉప సర్పంచ్ శిరీష్ రెడ్డి, గణేశ్, సాబీర్, ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చోడ(సిరికొండ), జూన్ 16: సిరికొండలోని గాంధీ చౌక్‌లో బీఆర్ఎస్ నాయకులు కేక్ కోసి పంచి పెట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పెంటన్న, తోకల చిన్న రాజన్న, ఎక్బల్, జాదవ్ రోహిదాస్, సూర్యవంశీ, కన్నం సూర్యకాంత్, విజయ్ కుమార్, చందు, నర్సయ్య, రాజు, సునీల్, భీంరావ్, రాజు, రాజేశ్, సందీప్, సురేశ్, దయాకర్, అబ్బుసేన్, అక్తార్ పాషా, నర్సయ్య, మిలన్, సుభన్ అలీ, అజ్గర్, నారాయణ, నర్సింహులు పాల్గొన్నారు.

భీంపూర్, జూన్16: భీంపూర్ పీహెచ్‌సీలో బీఆర్ఎస్ నాయకులు రోగులు, గర్భిణులు, బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. కరంజి(టీ) రామాలయంలో రైతులు, యువకులు అభిషేకాలు చేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నిఖిల్‌రాజ్, మాజీ జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, మాజీ ఎంపీపీ కుడిమెత రత్నప్రభ సంతోష్, మాజీ వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, నాయకులు లింబాజీ, నరేందర్, ప్రకాశ్, అనిల్, జాదవ్ రవీందర్, బక్కి కపిల్, బాదర్, జహూర్‌అహ్మద్, కల్చాప్‌యాదవ్, అఫ్రోజ్, బక్కి అజయ్, వేణు, ధరంసింగ్, రాథోడ్ ఉత్తమ్ , స్వామి, నితిన్ పాల్గొన్నారు.

### సాయిలింగి వృద్ధాశ్రమంలో..

తలమడుగు, జూన్ 16: సాయిలింగిలోని వృద్ధాశ్రమంలో బీఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ జన్మదిన వేడుకలు వేడుకలు నిర్వహించారు. బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ వృద్ధులతో కలిసి కేక్ కోశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముడుపు కేదారేశ్వర్ రెడ్డి, పిడుగు అభిరాంరెడ్డి, కౌడాల మహేందర్, వామన్, తోట ప్రమోద్, తోట చందు, మగ్గిడి ప్రకాశ్, సుదర్శన్ రెడ్డి, కంది నర్సింహులు, నాగరెడ్డి, సునీత రెడ్డి, రమాకాంత్, వెంకన్న, ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



తలమడుగు: సాయిలింగి వృద్ధాశ్రమంలో కేక్ కోస్తున్న నాయకులు



బోథ్‌లో..

### బీఆర్ఎస్ నాయకుల రక్తదానం

తాంసి(భీంపూర్), జూన్ 16: బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ఆదిలాబాద్ రిమ్స్‌లో భీంపూర్ మండలానికి చెందిన 100 మంది నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, ఎంపిపి సంతోష్, నాయకులు లింబాజీ రవీందర్, కపిల్, నాగయ్య పాల్గొన్నారు.

బోథ్, జూన్ 16: బోథ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జాదవ్ అనిల్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా మొక్కలు నాటాలి

నిర్మల్ అర్బన్, జూన్ 16 : నిర్మల్ జిల్లాలో పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వనమహోత్సవ జిల్లాస్థాయి అధికారుల సమీక్షలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ ఏడాది 69,56,268 మొక్కలను నాటడమే లక్ష్యంగా నిర్ణయించామని, లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని శాఖలకు టార్గెట్‌లు కేటాయించామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో 8,089 ఇళ్లకు ఆమోదం లభించిందని త్వరితగతిన మార్కౌట్ పూర్తి చేయాలన్నారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, జిల్లా అటవీ శాఖ అధికారిణి నాగిణి భాను, ఆర్డీవో రత్న కల్యాణి పాల్గొన్నారు.

### జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

కలెక్టర్‌గా అభిలాష అభినవ్ ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ కేక్ కట్ చేసి స్వీట్లను పంచిపెట్టారు.

### యోగా దినోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగ దినోత్సవం పోస్టర్లను కలెక్టర్ అభిలాష అభినవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈనెల 21న నిర్మల్ పట్టణంలోని దివ్య గార్డెన్‌లో నిర్వహించే యోగా దినోత్సవంలో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు.

### ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 16: ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, మాట్లాడారు. నిర్ణీత గడువులోగా అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. వానకాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో శానిటేషన్ చేపట్టాలన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాల సరఫరాలో ఆటంకాలు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్‌అహ్మద్, కిశోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన కాదు...పోలీసుల పాలన

నార్నూర్,జూన్16: సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజాపాలన కాదు..పోలీసుల పాలన కొనసాగుతుందని ఆదిలాబాద్ జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. హైదరాబాద్ బంజారా హిల్స్ ఏసీబీ కార్యాలయానికి కేటీఆర్ విచారణలో భాగంగా ఆదిలాబాద్ జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ మద్దతుగా సోమవారం వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ నాయకుడికి మద్దుతుగా వెళ్తే పోలీసులు వెళ్లనివ్వకుండా అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్‌పై మోసపూరితమైన ఎన్ని కేసులు పెట్టిన అయ్యేది ఏమి లేదన్నారు. రాబాయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## రాంపూర్, మైసంపేటవాసుల సాగు భూములకు పట్టాలు

కడెం, జూన్ 16: కవ్వాల్ అభయారణ్యంలోని పునరావాస గ్రామాలైన రాంపూర్, మైసంపేట గిరిజనులకు పట్టాలు అందజేస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 94మంది లబ్ధిదారుల్లో 78మందికి పట్టాలకు సంబంధించిన ప్రోసిడింగ్ కాపీలను ఇచ్చినట్లు తెలిపారు. మిగతా 16 మందిలో కొందరు మృతిచెందారని, మరికొంత మందికి సంబంధించి తప్పులున్న కారణంగా పరిశీలించి, సమగ్ర నివేదికల ఆధారంగా వారికి కూడా త్వరలోనే పట్టాలు జారీ చేయనున్నట్లు తహసీల్దార్ ప్రభాకర్ తెలిపారు. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 10న రెండు గ్రామాల గిరిజనులు పాత గ్రామాల్లో గుడిసెలు వేసి ఆందోళన బాట పట్టిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు వారికి పట్టాలు అందజేస్తామని అధికారుల నుంచి ఆదేశాలు జారీ కావడంతో వారి కళ నెరవేరనున్నది.

## ప్లాట్‌ను ఆక్రమించుకున్న వ్యక్తి రిమాండ్

ఎదులాపురం, జూన్ 16 : ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 68 సర్వే నంబర్లు పిట్టలవాడకు చెందిన గోడ్డల శ్రీనివాస్ ఈ ఏడాది ఏప్రిల్‌లో బోడెవార్ శ్రీకాంత్, రాథోడ్ రవీందర్‌కు చెందిన ప్లాట్‌ను ఆక్రమించుకున్న అందులో ఉన్న సిమెంట్ పోల్స్‌ను ధ్వంసం చేసి ప్లాట్‌ను ఆక్రమించాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న గోడ్డల శ్రీనివాస్‌ను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్ఐ విష్ణు వర్ధన్ తెలిపారు.

## వీధి బాలలను బడిలో చేర్పించిన అధికారులు

ఇచ్చోడ, జూన్ 16: ఇచ్చోడలో వీధుల్లో చెత్త ఏరుకుంటూ బడికి వెళ్లకుండా ఉన్న వీధి బాలలను డీసీపీయూ అధికారులు గుర్తించి కలెక్టర్ ఆదేశాల మేరకు మండల ప్రాథమిక పాఠశాల ఇచ్చోడలో చేర్పించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఎంతో విలువైన భవిష్యత్ గల బాలలను పాఠశాలలో చేర్పించకుండా వీధుల్లో వదిలి పెడుతున్న తల్లిదండ్రుల దగ్గరికి వెళ్లి వారిని హెచ్చరించాడు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సతీశ్, డీసీపీయూ సోషల్ వర్కర్ రవికాంత్, వోఆర్‌డబ్ల్యూ అశ్విని, సీఆర్పీ శ్యామ్, షూర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ వినోద్ పాల్గొన్నారు.

## విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా విజయలక్ష్మి

నిర్మల్ అర్బన్, జూన్ 16: నిర్మల్ జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా సోమవారం విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. గద్వాల జిల్లాలో సూపరింటెండెంట్‌గా పని చేసి పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీఈవో రామారావు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ విద్యాశాఖ పర్యవేక్షకులు వెంకటరమణ, శ్రావణి, సమన్వయకర్తలు సలోమి కరుణ, రాజేశ్వర్, లింబాద్రి, పోశెట్టి, కృష్ణవేణి ఉన్నారు.

## రైతులు లేని 'రైతు నేస్తం'



నార్నూర్ రైతువేదికలో రైతుల లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

నార్నూర్, జూన్ 16 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేత్తం వీడియో కాన్ఫరెన్స్ అనుసంధాన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖిగా రైతులతో మాట్లాడుతారని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు. కానీ.. రైతునేస్తం కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ముగ్గురు వ్యవసాయ అధికారులు, ఆరుగురు రైతులు మాత్రమే పాల్గొన్నారు. దీంతో రైతులు రాక కుర్చులు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఇక్కడ వ్యవసాయ శాఖ అధికారి ఆకాశ్, ఏఈవోలు రాజేందర్, సాయికుమార్ ఉన్నారు.

## అనుమానితులు కనిపిస్తే సమాచారం అందించాలి

ఇచ్చోడ(సిరికొండ), జూన్ 16: గ్రామాల్లో అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఇచ్చోడ సీఐ బండారి రాజు అన్నారు. సిరికొండ మండలంలోని రాంజీగూడ గ్రామంలో పోలీసులు మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజల సేవ చేసేందుకు పోలీసులు ఉన్నారన్నారు. సైబర్ నేరానికి గురైతే 1930 నంబర్, అత్యవసర పరిస్థితుల్లో 100 డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో సిరికొండ ఎస్ఐ శ్రీసాయి, కానిస్టేబుళ్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సొనాలలో యోగా వాక్

బోథ్, జూన్ 16: సొనాలలో యోగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం యోగా వాక్ నిర్వహించారు. యోగా గురించి నినాదాలు ఇస్తూ గ్రామంలోని పలు వీధుల గుండా ర్యాలీ తీశారు. కార్యక్రమంలో సొనాల యోగా ఇన్స్టక్టర్ మునిగేల యోగిత, మాజీ సర్పంచ్ సదానందం, సుభాష్, సూర్య, మురళీ, శంకర్, రవీందర్, ఆశకార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

## దళిత రైతుల గోడు పట్టించుకోరు కలెక్టర్ సారు

నార్నూర్, జూన్ 16 : ఏజెన్సీలో తము సాగు చేసే భూములకు పహాణీలు ఇప్పించి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని నార్నూర్, గాదిగూడ మండలాల్లోని ఎస్సీ రైతులు, ఏజెన్సీ దళిత భూ సంరక్షణ సమితి నాయకులు సోమవారం ఆదిలాబాద్‌లోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ సానూకులంగా స్పందించారని నాయకులు తెలిపారు. ఇక్కడ డివిజన్ అధ్యక్షుడు నిరంజన్, ఉపాధ్యక్షుడు మానే సంతోష్, సదాశివ్, ప్రధాన కార్యదర్శి నరహరికాంబ్లే, కోశాధికారి సూర్యవంశీ పండరి, విద్వన్, హన్మంత్‌రావ్, శేషారావ్, జైపాల్, దళిత రైతులు ఉన్నారు.

## గడ్డం శ్రీనివాస్‌పై కేసు

పెంబి, జూన్ 16: పెంబి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజురా గ్రామంలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన పనులుకు బిల్లులు రాకపోవడంతో పాఠశాలకు తాళం వేసిన గడ్డం శ్రీనివాస్‌పై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలకు వెళ్లకుండా అడ్డుకున్నందుకు, రోడ్డుపై వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించినందుకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## సెల్‌ఫోన్ దొంగతనానికి యత్నించిన వ్యక్తి అరెస్ట్

ఎదులాపురం, జూన్ 16: సెల్‌ఫోన్ దొంగతనానికి యత్నించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయం ఆదిలాబాద్ వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ సోమవారం కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆదివారం సాయంత్రం 6:30 గంటల సమయంలో ఆదిలాబాద్ ఎన్టీఆర్ చౌక్ వద్ద సంజయ్ నగర్‌కు చెందిన ఖందేల్వార్ రాజకుమార్ శర్మ అనే వ్యక్తి జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను అపహరించే ప్రయత్నం చేశాడని పోలీసులు తెలిపారు. శర్మ అప్రమత్తమై నిందితుడిని పట్టుకునే ప్రయత్నం చేయగా అతడు పారిపోవడానికి ప్రయత్నించాడు. అయితే స్థానికుల సహాయంతో నిందితుడిని వెంటనే పట్టుకొని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పోలీసుల దర్యాప్తులో నిందితుడిని చిలుకూరి లక్ష్మీనగర్‌కు చెందిన షారుక్‌ఖాన్‌గా గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

## రైలు కిందపడి ఒకరి మృతి

ఎదులాపురం, జూన్ 16: పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన నిమ్మల సంతోష్(39) గుర్తు తెలియని రైలు ఢీ కొని మృతి చెందాడు. రైల్వే ఔట్ పోస్ట్ హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన సంతోష్ రాత్రి వరకు తిరిగి రాలేదు. సోమవారం ఉదయం గూడ్స్ రైలు పైలట్ ఇచ్చిన సమాచారం మేరకు ప్రమాద ఘటన వెలుగు చూసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిమ్మల సంతోష్‌కు అనారోగ్య సమస్యలు ఉన్నాయని తెలిపారు.

## ఇద్దరు అదృశ్యం

ఎదులాపురం, జూన్ 16: ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి, యువకుడు అదృశ్యమైనట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. వాల్మీకి నగర్‌కు చెందిన యువతి(23) ఆదివారం మధ్యాహ్నం తన స్నేహితురాలి ఇంటికి చదువుకోవడానికి వెళ్తున్నాను అని చెప్పి తిరిగి రాలేదు. అలాగే శ్రీరామ్‌కాలనీకి చెందిన యువకుడు (23) తన స్నేహితుడి పెళ్లికి వెళ్లొస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. అదృశ్యమైన యువతి, యువకుడు తల్లిదండ్రులు వేర్వేరుగా వన్ టౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## మద్యం మత్తులో బలవన్మరణం

కుభీర్, జూన్ 16: మద్యం మత్తులో ఓ యువకుడు వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కుభీర్ మండలంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నిగ్వ గ్రామానికి చెందిన వాగ్మారే సాయినాథ్(26) ప్రతిరోజూ మద్యం తాగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య మందలించింది. దీంతో సాయినాథ్ మద్యం మత్తులో సమీప వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## నకిలీ విత్తనాలు పట్టివేత

ఇచ్చోడ, జూన్ 16: దాబా(బీ) గ్రామంలో నర్వారే ఈశ్వర్ ఇంట్లో 20 నకిలీ విత్తనాల ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని మండల టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తెలిపారు. ఆదిలాబాద్‌కు చెందిన వ్యాపారి వద్ద నుంచి నకిలీ విత్తనాలు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామని, ఆదిలాబాద్ వ్యాపారి పరారీలో ఉన్నాడు. అతని కోసం గాలింపు చేపట్టామని ఎస్ఐ పురుషోత్తం తెలిపారు. ఈ దాడిలో ఏవో భగవత్ రమేశ్, ఆర్ఐ హుస్సేన్ ఉన్నారు.